# రోడ్డు కాదు.. గుంతల గ్యాలరీ..!

● ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేదు..


ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత


ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై జాగ్రత్తగా వస్తున్న వాహనదారులు




రోడ్డు ధ్వంసమై రెండు వైపులా గుంతల్లో నిలిచిన వర్షపునీరు

**మహబూబాబాద్ రూరల్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి బయ్యారం వైపునకు వెళ్లే ప్రధాన రోడ్డు ప్రమాదకరంగా తయారై వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్తిగార్డెన్స్ సమీప ప్రాంతం నుంచి అనంతారం దేవాలయ ప్రవేశ ద్వారం మీదుగా మరికొంత దూరం వరకు ప్రధాన రహదారి మార్గం గుంతలమయంగా మారిపోయింది. చిన్నపాటి వర్షం వచ్చినా సరే ఆ గుంతల మయమైన రోడ్డుపై వర్షపు నీరంతా నిలిచి అక్కడ రోడ్డు ధ్వంసమైన విషయం వాహనదారులకు తెలియకుండా ఉంటుంది. ఇటీవలి కాలంలో పలుమార్లు వర్షాలు కురిసిన సమయంలో ఆ గుంతల్లో ద్విచక్రవాహనాలు ఇరుక్కుని పలువురు తీవ్రగాయాలపాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రధాన రోడ్డుపై పడిన గుంతల్లో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయి కొద్ది రోజుల క్రితం తాట్యతండా గ్రామానికి చెందిన భూక్య వీరన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులు, రహదారులు, భవనాల శాఖ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. కేవలం ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అయ్యో పాపం అంటున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న సీఐ రాజ్‌కుమార్

**చిన్నగూడూరు:** నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని విస్సంపల్లి గ్రామంలో చిన్నగూడూరు, మరిపెడ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 2క్వింటాళ్ల నల్లబెల్లం, 50కేజీల పటిక, 40లీటర్ల గుడుంబా, రూ.40 వేలు విలువైన మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతేగాకుండా సరైన పత్రాలు లేని 42 ద్విచక్రవాహనాలు, 5ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. యువత గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, సంతోష్‌కుమార్, సతీష్, ఏఎస్సై వెంకటయ్య, 32 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

**తొర్రూరు రూరల్:** ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా చదువుకుంటున్న విద్యార్థుల బకాయిలు చెల్లించాలని, పాఠశాలలోకి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వెలికట్ట గ్రామశివారులోని పీఎస్ఆర్ స్కూల్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. మూడేళ్లుగా అనేక ప్రైవేట్ స్కూళ్లకు బెస్ట్ అవైలబుల్ పథకం బకాయిలు విడుదల చేయకపోవడంతో స్కూళ్ల యాజమాన్యం విద్యార్థులను స్కూళ్ల ప్రవేశానికి అనుమతి ఇవ్వకపోవడం దిక్కులేని స్థితిలో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. సమాచారం తెలుసుకున్న విద్యా, పోలీస్‌శాఖల అధికారులు ఘటన స్థలానికి చేరుకొని స్కూల్ యాజమాన్యంతో చర్చించి, విద్యార్థులను స్కూల్‌లోకి అనుమతించడంతో ఆందోళనను విరమించారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్


మాట్లాడుతున్న కమిషనర్ రాజేశ్వర్

**మహబూబాబాద్:** సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్య, ఫాగింగ్‌పై మున్సిపల్, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అన్నివార్డుల్లో ప్రతీరోజు పారిశుద్ధ్య జరుగుతున్నాయని, డెంగీ కేసుల ఉన్న ప్రాంతాలలో ఫాగింగ్ నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బంది కూడా సహాయ సహకారాలు అందించాలన్నారు. దోమకాటు నుంచి రక్షించుకోవాలని, పలు జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, హెల్త్ అసిస్టెంట్ లింగారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్

**మహబూబాబాద్ రూరల్:** గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 300గ్రాముల ఎండు గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక మంగళవారం తెలిపారు. రూరల్ రెండో ఎస్సై కె.రవికిరణ్, పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా జమాండ్లపల్లి గ్రామ శివారులో గల కుంట వద్ద పలువురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి సేవిస్తున్నట్లు ఒప్పుకున్నారు. నడివాడ జీపీ పరిధిలోని రంగశాయిపేట గ్రామానికి చెందిన బండి శ్రావణ్ గంజాయి అమ్మగా అదే గ్రామానికి చెందిన బత్తుల సాగర్, జమాండ్లపల్లి గ్రామ శివారు చంద్రు తండాకు చెందిన బానోత్ సునీల్, జమాండ్లపల్లి గ్రామానికి చెందిన జుజ్జూరి రఘు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించారు. సాగర్, సునీల్, రఘు పట్టుబడగా శ్రావణ్ పరారయ్యాడని, వారి వద్ద నుంచి రూ.15వేల విలువగల 300 గ్రాముల ఎండు గంజాయి, గంజాయి తాగడానికి వాడే బాటిల్, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

# యాత్రను విజయవంతం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

**నెహ్రూసెంటర్:** అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 14న జరగనున్న రేజంగ్లా కలశ యాత్రను విజయవంతం చేయాలని మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రమేష్‌యాదవ్, పీసీసీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో యాత్ర కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. భారత్, చైనా యుద్ధ సమయంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన 114 మంది అమరులయ్యారని, వారి పోరాటం, త్యాగానికి గుర్తుగా భారత సైన్యంలో రెజిమెంటల్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో యాత్ర జరుగుతుందన్నారు. విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బట్టు శ్రీను, ఎడ్ల రమేష్, స్వర్ణలత, కంబాల ముసలయ్య, సంద మహేష్, సింగం మల్లేష్, చెవిటి ఐలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


వివరాలు పరిశీలిస్తున్న డీఆర్డీఓ మధుసూదన్ రాజు

**మహబూబాబాద్ రూరల్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే అధికారులు, సిబ్బంది తమ విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఆర్డీఓ మధుసూదన్ రాజు అన్నారు. ఎంఎస్ఆర్ఈజీఎస్ 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రెండో రోజైన మంగళవారం నిర్వహించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి మధుసూదన్ రాజు సమక్షంలో గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం ద్వారా వివరాలు సేకరించిన డీఆర్పీలు వారి నివేదికను చదివి వినిపించారు. రూ.1,51,262 రికవరీకి డీఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ మహేష్, అంబుడ్స్ మెన్ ఆదాం, ఏపీఈ మన్మోహన్ రెడ్డి, ఎంపీడీఓ రఘుపతి రెడ్డి, ఏపీఓ రమేష్ రెడ్డి, ఎంపీఓ పార్థసారథి, డీఆర్పీలు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి


బురదను తొలగిస్తున్న స్పెషల్ అధికారి

**కురవి:** గ్రామంలోని ప్రతీ ఒక్కరు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీరోలు ఎంఈఓ, కొత్తూరు (సీ)స్పెషల్ అధికారి ఇస్లావత్ లచ్చిరాంనాయక్ అన్నారు. మంగళవారం సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు నేతృత్వంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధులను శుభ్రంగా ఊడ్చారు. చెత్తా చెదారాన్ని, ముళ్ల కంపలను, రోడ్లపై ఉన్న బురదను తొలగించారు. ఈసందర్భంగా లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పగడాల కృష్ణారెడ్డి, చిప్పరపల్లి వెంకన్న, రాయబారపు వినయ్, ఎల్లయ్య, సుధాకర్, వినయ్ పాల్గొన్నారు.

# పత్రికలు చదివి విజ్ఞానం పెంచుకోవాలి


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

**మహబూబాబాద్ అర్బన్:** విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయంలో పుస్తక పఠనం, వార్తాపత్రికలు చదివి విజ్ఞానం పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భారత జాతీయ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ హెచ్ఓడీ రాజశేఖర్, అసిస్టెంట్ బి.రఘురాం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఐక్యూసీ కోఆర్డినేటర్ అనిల్, అధ్యాపకులు మసూద్ ఆహ్మద్, సాంబశివరావు, శ్రీనివాస్, హతిరామ్, ఖాసీంపాషా, సుమన్ పాల్గొన్నారు.

# బ్యాంక్ రుణాలు ఇవ్వాలని ఆందోళన


మాట్లాడుతున్న రైతులు

**బయ్యారం:** తమ భూములకు బ్యాంకు లోన్లు ఇవ్వాలని కోరుతూ మండలంలోని గంధంపల్లి-కొత్తపేటకు చెందిన గిరిజన రైతులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వంలో తమ భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు బ్యాంకర్లు లోన్లు ఇచ్చారని, ఆ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలు రద్దు చేసి, లోన్లు ఇవ్వడం నిలిపివేశారన్నారు. దీంతో తాము గతంలో తీసుకున్న రుణాలకు రుణమాఫీ వర్తించలేదని, ఆ రుణాలు చెల్లించాలని బ్యాంకులు నోటీసులు ఇస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ భూములకు రెవెన్యూ పట్టాలు ఇచ్చి బ్యాంకు లోన్లు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతులు వీరభద్రం, రాములు, లింగరాజు, శివలింగం, శ్రీను, రామకృష్ణ, ఆంజనేయులు, వెంకన్న, మహేష్, రాంబాబు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

## తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

**డోర్నకల్:** రైల్లో ప్రయాణిస్తూ తప్పిపోయిన వృద్ధుడిని డోర్నకల్ ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. డోర్నకల్ ఆర్పీఎఫ్ ఎస్సై వై.నాగరాజు, ఏఎస్సై టి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని నవదా జిల్లా గౌండాపూర్‌కు చెందిన అమిత్‌కుమార్ మానసిక స్థితి సక్రమంగా లేని తన తండ్రి రామ్‌జనమ్‌ప్రసాద్(70)తో కలిసి పాట్నా కోయంబత్తూర్ ప్రత్యేక రైలులో గయా నుంచి కాట్‌పాడి బయలుదేరారు. సోమవారం ఉదయం రైలు డోర్నకల్ స్టేషన్‌లో ఆగగా రామ్‌జనమ్‌ప్రసాద్ రైలు నుంచి దిగాడు. తన తండ్రి కనిపించకపోవడంతో అమిత్‌కుమార్ మదిరలో రైలు దిగి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు రామ్‌జన్‌ప్రసాద్‌ను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. సోమవారం అర్ధరాత్రి ఎస్సై, నాగరాజు, ఏఎస్సై శ్రీనివాసరావు సమక్షంలో రామ్‌జన్‌ప్రసాద్‌ను కుమారుడికి అప్పగించారు.

## సంక్షిప్త సమాచారం

**చెరువులకు రక్షణ కల్పించాలి**

**డోర్నకల్:** డోర్నకల్ పరిధిలోని రెండు చెరువులు కబ్జాకు గురి కాకుండా రక్షణ కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు ఎల్.విజయ్‌కాంత్ కోరారు. డోర్నకల్ శివారులోని పెద్ద చెరువు, బందం చెరువులను మంగళవారం బీఎస్పీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల ప్రవీణ్, హుస్సేన్‌నాయక్, కూరాకుల మహేష్, కోట వేణు పాల్గొన్నారు.

**సభ్యత్వ నమోదు**

**మహబూబాబాద్ అర్బన్:** ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు అందజేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంజిరాల నాగరాజు, గుడిబోయిన గోపికృష్ణ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు.

**ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు**

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం సంఘ కార్యాలయంలో సంఘం జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాగం లోకేష్, వెలుగు శ్రావణ్, నాయకులు మేక వెంకటేష్, వికాస్, ప్రకాష్, ప్రతాప్, వంశీ పాల్గొన్నారు.

**చెక్‌డ్యాం నిర్మించాలి**

**దంతాలపల్లి:** తొర్రూరు, దంతాలపల్లి, పెద్దముప్పారం గ్రామాలను కలుపుతూ మండలంలోని పాలేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి చెక్‌డ్యాం నిర్మించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి లింగన్న అన్నారు. మంగళవారం పాలేరు వాగును పరిశీలించారు.

**గార్లకు బస్సు సర్వీస్ ఏర్పాటు**

**గార్ల:** మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి గార్లకు ఆర్టీసీ బస్సును మంగళవారం నుంచి ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో అధికారులు తెలిపారు.

**వైద్య పరీక్షలు**

**మహబూబాబాద్ అర్బన్:** ప్రతి విద్యార్థినీ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థినీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

**పనులు త్వరగా పూర్తి చేయాలి**

**గూడూరు:** ఏకలవ్య మోడల్ స్కూల్ భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని చెండ్రుగూడెం శివారు మొదలైన ఏకలవ్య మోడల్ స్కూల్ భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు చెల్పూరు శ్రీశైలం, బత్తుల లక్ష్మణ్, ఎలమందల శ్రీనివాస్, అయిలి రాము పాల్గొన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**నెల్లికుదురు:** ఈనెల 13నుంచి 15వరకు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చందా నరేష్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు మంగళవారం విజ్ఞప్తి చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల పత్రాల అందజేత**

**కురవి:** మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి అనుమతి పత్రాలను కురవి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి అవిరె మోహన్‌రావు, మండల ఉపాధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్ మంగళవారం అందజేశారు.

**సీఎం మాట నిలుపుకోవాలి**

**గూడూరు:** ఎన్నికల ముందు వికలాంగులకు, వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి పింఛన్లు పెంచాలని వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు పాషం సాంబయ్యమాదిగ డిమాండ్ చేశారు. మండలంలోని పొనుగోడులో మంగళవారం వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బుడిగె శ్రీరాములు, ముక్తీశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**టై, బెల్ట్‌ల పంపిణీ**

**మరిపెడ రూరల్:** మండలంలోని గాలివారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మంగళవారం టై, బెల్ట్‌లు అందించి దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం అనంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కనీస వేతనం అమలు చేయాలి**

**నెహ్రూసెంటర్:** కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తూ విడుదలైన జీఓలకు యధాతథంగా గెజిట్ విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ అన్నారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా లేబర్ కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాగన్న, శ్రీనివాస్, దుర్గారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**గుడుంబా తయారీదారులపై కేసు నమోదు**

**తొర్రూరు:** గుడుంబా తయారీదారులపై కేసు నమోదు చేసినట్లు సీఐ బూస అశోక్ మంగళవారం తెలిపారు. మండలంలోని అమర్‌సింగ్ తండాకు చెందిన హపావత్ రెడ్యా, హపావత్ సురేష్ కొంత కాలంగా గుడుంబా తయారు చేస్తున్నారు. గతంలో వీరిని బైండోవర్ చేసినప్పటికీ మార్పు రాలేదు. దీంతో వారిపై బ్రీచ్ కేసు నమోదు చేసి ఒక్కొక్కరి నుంచి రూ.40వేల చొప్పున రూ.80 వేల జరిమానా విధించారు. ఈ సమావేశంలో ఎస్సైలు రవళిరెడ్డి, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

**ఘనంగా తీజ్ ఉత్సవాలు**

**చిన్నగూడూరు:** మండలంలో ఉగ్గంపల్లి శివారు మంచ్యాతండాలో జరిగిన తీజ్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పాల్గొని గోధుమనారు బుట్టలను మహిళలకు అందించి ఊరేగింపును ప్రారంభించారు.

**డోర్నకల్:** స్థానిక సెకండ్ మెయిన్ రోడ్డులో మంగళవారం మార్వాడీ మహిళలు తీజ్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

**సేవాగుణాన్ని కలిగి ఉండాలి**

**కేసముద్రం:** మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన లయన్స్ క్లబ్ భవనాన్ని సోమవారం రాత్రి లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ఎస్.సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు దాతలు, సహకరించిన వారిని సన్మానించారు. అనంతరం క్లబ్ కేసముద్రం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి అశోక్, కార్యదర్శిగా డాక్టర్ బానోతు మోహన్‌నాయక్, కోశాధికారిగా రాపోలు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ పి.హరికిషన్‌రెడ్డి, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజేందర్‌రెడ్డి, చిర్ర యాకాంతం గౌడ్, ఎర్రం శ్రీరాములు, చందా గోపి పాల్గొన్నారు.


**చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి**

**బయ్యారం:** ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని జగ్గతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బాణోత్ వీరన్న(45) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఈనెల 3న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌కు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జయప్రదం చేయాలి

**నెల్లికుదురు:** ఈనెల 16న జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గౌడ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ గౌడ్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గౌడ యువజన సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు యుగేందర్, మండల అధ్యక్షుడు పెరుమాళ్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు సతీష్, ప్రశాంత్, కార్యదర్శులు క్రాంతి, లింగమూర్తి, కిరణ్, కోశాధికారి అశోక్, సభ్యుడు రాజులను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కమిటీ సభ్యుడిగా పెరుమాళ్ల సాగర్‌ను ప్రకటించారు.

# యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం


ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**గూడూరు:** రైతు పంటలకు సరిపడా యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎస్సై గిరిధర్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని ఎలాంటి గొడవలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. మండల రైతులకు అవసరమైన యూరియా అందిస్తామన్నారు. ఏఓ మాటలతో నాయకులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో నాయకులు కఠార్‌సింగ్, వెంకన్న, రమేష్, శ్రీహరిగౌడ్, రహీంపాషా పాల్గొన్నారు.

**సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో..**

**తొర్రూరు:** యూరియా కొరత తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

**కేసముద్రం:** కేసముద్రం, ఇంటికన్నె రైల్వేస్టేషన్‌లలో, వ్యవసాయ మార్కెట్ ప్రాంతాల్లో మంగళవారం బాంబు స్క్వాడ్ బృందం, స్పెషల్‌పార్టీ, కేసముద్రం పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తనిఖీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### వరినాట్ల పరిశీలన

**కురవి:** సీరోలు మండలం కాంపల్లిలో మహేష్ అనే రైతు వేస్తున్న వరినాటును జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. సీరోలు ఏఓ చాయారాజ్, ఏఈఓ భరత్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములను గుర్తించాలి

**కురవి:** ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించాలని, వాటికి సూచిక బోర్డులు పెట్టాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో దేవాదాయ భూములున్నప్పటికీ వాటిని గుర్తించడంలో విఫలం అయ్యారని తెలిపారు. దేవాలయ భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని, సర్వే చేయాలని డిమాండ్ చేశారు. హరిత హోటల్, ఎస్సీ హాస్టల్ భవనాలకు భూములను ఇచ్చి నిర్మాణాలు జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజన్న, వెంకన్న, ఉప్పలయ్య, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి


**మహబూబాబాద్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో దివ్యాంగుడిని ఈడ్చికెళ్లిన వారిపై చర్య తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్పీఆర్డీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, సరిత, నాగరాజు, ప్రభాకర్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

### గౌడ యువజన సంఘం కమిటీ ఎన్నిక


వినోద్, అధ్యక్షుడు

**తొర్రూరు:** గౌడ యువజన సంఘం నూతన మండల కమిటీని మంగళవారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బొమ్మెర వినోద్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా మాచర్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా చీకటి దిలీప్, కుర్ర నరేష్, కోశాధికారిగా ధీకొండ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడిగా బొమ్మగాని మనోజ్ ఎన్నికయ్యారు.

**అధ్యక్షుడిగా సుధాకర్ గౌడ్**



**నెల్లికుదురు:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ యువజన సంఘం ఇనుగుర్తి మండల కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దీపక్‌గౌడ్ మంగళవారం ఏకగ్రీవంగా ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మద్దెల సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు బుర్ర సందీప్ గౌడ్, గాడిపెల్లి రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి జనగం సందీప్ గౌడ్, కోశాధికారి బైరు వేణు గౌడ్, కార్యదర్శి గుర్రం రాజేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు కూటికంటి మధులను ప్రకటించారు.

### జిల్లా కార్యదర్శిగా అనిల్

**చిన్నగూడూరు:** గౌడ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ తెలిపారు.

### రోడ్డు ఇలా.. నడిచేదెలా



**బయ్యారం:** ఈ చిత్రంలో బురదతో కనపడుతున్న రహదారి మండలకేంద్రంలోని బండ్లమాంబ ఆలయ ప్రాంతం. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టి మొత్తం బురదమయంగా మారింది. సంబంధిత అధికారులు ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### సన్మానం

**దంతాలపల్లి:** మండలంలోని రామానుజాపురం గ్రామానికి చెందిన మల్లం లింగన్నను మంగళవారం ఎస్పీ రాంనాథ్ కేకన్ జిల్లా కేంద్రంలో సన్మానించారు. సోమవారం తొర్రూరు మండలం మాటేడు గ్రామంలో ఓ మహిళ మెడలో గొలుసు లాక్కొని పారిపోతుండగా లింగన్న దొంగలను వెంబడించి పట్టుకోవడంలో తోడ్పడ్డాడు. అలాగే సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలానికి చెందిన సాయి, భిక్షపతి, విజయ్‌లను సన్మానించారు.